మీ కోసం.. ఎందుకు?

- సమస్యల అపరిష్కృత వేదికగా పీజీఆర్ఎస్
- రెవెన్యూ పరిధిలోనే ఫిర్యాదులు అధికం
- క్షేత్ర స్థాయిలో సమస్యల పరిష్కారం శూన్యం



పెరవలి తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదులు అందిస్తున్న అర్జీదారులు



అన్నవరప్పాడు గ్రామంలోని ఆర్అండ్‌బీ రోడ్డుపై పారుతున్న మురుగునీరు

పెరవలి: కూటమి సర్కారు ఆర్భాటంగా ప్రారంభించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్జీవ వ్యవస్థలా మారింది. అధికారుల సమక్షంలో తమ సమస్యను చెబితే పరిష్కారమవుతుందనే ఆశతో వచ్చిన అర్జీదారులకు నిరాశనే మిగుల్చుతుంది. గడిచిన ఏడాది కాలంగా మండలంలో ప్రజల నుంచి 363 అర్జీలు స్వీకరించగా వీటిలో దశమ భాగం రెవెన్యూకు సంబంధించి 220 ఫిర్యాదులు ఉన్నాయి. సమస్యల పరిష్కారంపై ఇటీవల ప్రజల్లో సంతృప్తి అనేది పెరగకుండా తగ్గుతోంది. అగ్రికల్చర్, విద్యుత్, హెల్త్ డిపార్టమెంట్లలో చిన్న చిన్న సమస్యల పరిష్కారం మినహా సంతృప్తికర స్థాయిలో అధికారుల నుంచి స్పందన ఉండటం లేదని అర్జీదారులు వాపోతున్నారు. పీజీఆర్ఎస్‌తో పరిపాలనను సరళతరం చేశామని కూటమి చెప్పుకోవటమే తప్ప ఎందుకూ పనికిరా వ్యవస్థ అని బహిరంగంగా విమర్శిస్తున్నారు.

కూటమి సర్కారు ఆర్భాటంగా..

ప్రభుత్వం పరిపాలనలో ఎటువంటి సంస్కరణలు తీసుకువచ్చినా దానిని క్షేత్రస్థాయిలో చిత్త శుద్ధితో అమలు చేయవలసిన అధికారులు ఏమీ పట్టనట్టు ఉంటే దాని ఫలితాలు ప్రజలకు చేరకుండా నిరీర్యం అవుతుంది. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే అట్టహాసంగా ప్రారంభించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు అలాగే తయారైయ్యింది. ఈ కార్యక్రమంలో ఇచ్చిన ఫిర్యాదులను అధికారులు పరిష్కరించకపోవడంతో ప్రజలకు విశ్వాసం సన్నిగిల్లుతోంది. సమస్యలను పరిష్కరించకపోయినా ఉన్నతాధికారులకు వాటిని పరిష్కరించినట్లు చూపిస్తున్న అధికారులు తీరుపై లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పచ్చనేతల కనుసన్నల్లో..

పెరవలి తహసీల్దార్ కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమానికి అర్జీదారులు ఎవ్వరూ రాకపోవటంతో అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతున్న విషయాలను వింటూ కాలక్షేపం చేశారు. నూతన పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాల కేటాయింపులు పచ్చనేతల కనుసన్నల్లో వారి అనుచరులకు మాత్రమే తప్ప సామాన్యులకు అందని ద్రాక్షేనని అంటున్నారు. మండలంలో గత ఏడాది కాలంగా చిన్న, చిన్న సమస్యలు పరిష్కారమయ్యాయి కాని, రేషన్ కార్డులు, ఇళ్లు, ఫింఛన్‌లు, ఇళ్ల స్థలాలు, మురుగునీటి సమస్యలు ఒక్కటి పరిష్కారం అవ్వలేదు. లబ్ధిదారులు ఎన్నో వ్యయ ప్రయాసలు కోర్చి ఇక్కడకు వచ్చి దరఖాస్తులు ఇస్తుంటే ఆన్‌లైన్ చేసామంటున్నారు, కాని పనులు మాత్రం జరగటంలేదని అలాంటప్పుడు ఎందుకొచ్చిన సమావేశాలంటూ ధ్వజమెత్తుతున్నారు. గతంలో ఉండే స్పందన పేరు మార్చి ప్రజా సమస్యల పరిష్కారవేదిక అంటూ కొత్తగా పిలుస్తున్నారని దీనిలో కొత్త ఏముందని ప్రశ్నిస్తున్నారు.

అధికారుల కాలక్షేపం



పీజీఆర్ఎస్ కార్యక్రమం అధికారులకు కాలక్షేపంగా ఉంది తప్ప, సామాన్యుల సమస్యలు తీరటానికి పనికిరాకుండా ఉంది. పీజీఆర్ఎస్‌లో దరఖాస్తులు చేయటమే తప్ప ఒక్క సమస్య కూడా పరిష్కారం కావడం లేదు.

బుద్ధన లక్ష్మణరావు,
కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, పెరవలి

పీజీఆర్ఎస్ ఎందుకు ?



కనీసం మురుగునీటి సమస్య తీర్చలేని ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎందుకు. ప్రజలను మభ్యపెట్టటానికే తప్ప ఎందుకూ ఉపయోగం లేదు. సంక్షేమ పథకాలు, రాజకీయ నాయకుల కనుసన్నల్లో కొనసాగుతుండటంతో దీని వలన సామాన్యులకు ఎలాంటి న్యాయం జరగడం లేదు.

పళ్లేటి రవి, ఎంపీటీసీ సభ్యుడు, ఖండవల్లి

క్లుప్తంగా

మావుళ్లమ్మకు వెండి సూత్రాల సమర్పణ

తాళ్లపూడి: మండలంలోని ప్రక్కిలంక గ్రామదేవత శ్రీ మావుళ్లమ్మ అమ్మవారికి అడపా రామకృష్ణ సత్యవేణి దంపతుల కుమార్తె సత్య ప్రసన్న పుట్టినరోజు సందర్భంగా అమ్మవారికి వెండి సూత్రాలు, ధూపదీప నైవేద్యాలకు సంబంధించిన 25 కేజీల బియ్యం నూనె, సీలింగ్ ఫ్యాన్‌ను ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు సమక్షంలో బహూకరించారు.

మాజీ హోం మంత్రికి నాయకుల పరామర్శ



బాబూరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నల్లజర్ల: వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గం కన్వీనర్, మాజీ హోంమంత్రి తానేటి వనిత మామగారు తానేటి బాబూరావు ఇటీవల మృతిచెందిన విషయం విధితమే. ఈ సందర్భంగా ఆదివారం దేవరపల్లి మండల నాయకులు వనిత, ఆమెభర్త శ్రీనివాసరావు దంపతులను పరామర్శించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గన్నమనేని వెంకటేశ్వరావు మూడు మండలాల పార్టీ అధ్యక్షులు కూచిపూడి సతీష్, ప్రతాపనేని వాసు, వెల్లంకి వెంకట సుబ్రమణ్యం, త్యాజంపూడి సర్పంచ్ కుసులూరి సతీష్, జానకీరామ్, నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు చిలకా సతీష్, గంగరాజు, రమాప్రభ, అచ్యుతరావు తదితరులున్నారు.

కోటసత్తెమ్మ ఆలయానికి భక్తుల తాకిడి

నిడదవోలు రూరల్: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు అప్పారావు శర్మ పర్యవేక్షణలో కోటసత్తెమ్మ అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అమ్మవారి దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోలు అమ్మకంతో రూ.1,35,196 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా



హనుమాన్ చాలీసా పారాయణ చేస్తున్న భక్తులు

నిడదవోలు: స్థానిక దాసాంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామదూత హనుమాన్ చాలీసా పారాయణ భక్త బృందం ఆధ్వర్యంలో ఆదివారం 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాస్కరరావు, రామచంద్రరావు, చంద్రమతి, ప్రత్తిపాటి కృష్ణమూర్తి, ఆకుల సత్యనారాయణ, చిక్కాల సురేష్, వేదుల జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుడికి సత్కారం

నిడదవోలు: మోగా డీఎస్సీలో పీడీ పోస్టులకు సంబంధించి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా మాజీ సైనికుల కోటాలో మొదటి ర్యాంకు సాధించిన బొచ్చ కృష్ణను స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో జువ్వల రాంబాబు, సానెపు సుబ్బారావు, పైడయ్య, ఎస్.విష్ణు, గంగుల గోపీయాదవ్. మునేశ్వరరావు, గంటా బుజ్జీ గూడూరి గోవిందరాజులు, షేక్ జాకీర్, కిషోర్, నానీ, ఏడుకొండలు, బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీ సీజ్

నిడదవోలు (ఉండ్రాజవరం): ఉండ్రాజవరం మండలం మోర్త నుంచి పాలంగికి అక్రమంగా ఎటువంటి బిల్లులు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని ఆదివారం స్పెషల్ బ్రాంచ్ పోలీసులు తనిఖీల్లో సీజ్ చేశారు. ఈ మేరకు ఏఆర్ఎస్ కన్వీనర్ ఎ.లక్ష్మణరావు లారీని ఉండ్రాజవరం పోలీస్ స్టేషన్‌కు తరలించి సిబ్బందికి డ్రైవర్‌ను అప్పగించారు.

కానిస్టేబుళ్లుగా ఎంపికైన హోంగార్డులకు అభినందనలు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లాలో హోంగార్డులుగా విధులు నిర్వర్తిస్తూ కానిస్టేబుళ్లుగా ఎంపికైన నలుగురిని జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్ ఆదివారం అభినందించారు. జిల్లా పోలీసు శాఖలో హోంగార్డులుగా పని చేస్తూ ఇటీవల రాష్ట్ర స్థాయి పోలీసు నియామక మండలి వెల్లడించిన ఫలితాల్లో సివిల్ కానిస్టేబుళ్లుగా జిల్లాకు చెందిన నలుగురు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీమాట్లాడుతూ పోలీసుశాఖపై అవగాహన, అనుభవంతో మరింత ఉన్నతంగా సేవలందించాలన్నారు. క్రమశిక్షణ, నిజాయతీతో పని చేసి, పోలీసు శాఖకు మంచి పేరు తేవాలని, విధుల్లో నిబద్ధతతో పని చేసి, ప్రజలకు సేవలందించాలన్నారు

రక్తదానం సామాజిక బాధ్యత



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు: రక్తదానం చేయడంలో ప్రతీ ఒక్కరూ సామాజిక భాధ్యత వహించాలని, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందకపోవడంతో ఆపదలో ఉన్న ఎంతో మంది ప్రాణాలను కొల్పోతున్నారని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. పట్టణంలో కోటరీ ఆడిటోరియంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ, బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఆయన పిలుపునిచ్చారు. శిబిరంలో కాకినాడ రోటరీ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది 28 మంది రక్తదాతల నుంచి రక్తం సేకరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మీసాల హరిప్రసాద్, కార్యదర్శి దారపురెడ్డి ప్రతాప్, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, బ్రహ్మకుమారీస్ సిస్టర్ శశిరేఖ, బ్లడ్ బ్యాంక్ నిర్వహకుడు డాక్టర్ కామరాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక



క్రీడాకారులతో బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సబ్ జూనియర్, సీనియర్ బాలబాలికల బాల్ బ్యాడ్మింటన్ జట్లను ఎంపిక చేసినట్లు బాల్ బ్యాడ్మింటన్ సంఘం జిల్లా కార్యదర్శి సీహెచ్ సతీష్‌కుమార్ తెలిపారు. పాఠశాల హెచ్ఎం ఎస్.హెప్సిబా అధ్యక్షతన ఆదివారం ఎంపిక పోటీలు జరిగాయి. ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు ప్రకాశం జిల్లా చేవూరులో నిర్వహించే రాష్ట్ర సబ్ జూనియర్, సీనియర్ బాలబాలికల అంతర్ జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహిస్తారని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆలపాటి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు ఆలపాటి కాశీ విశ్వానాథం, కెనరాబ్యాంక్ మేనేజర్ ఐ.సత్యనారాయణ, పీడీలు పాల్గొన్నారు.

సేవలు మరింత విస్తృతం చేసేందుకు ప్రణాళికలు

- భారత్ వికాస్ పరిషత్ రీజినల్ ఫైనాన్స్ సెక్రటరీ (సౌత్) రాజగోపాల పాయ్
- విశాఖ ప్రాంత్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

రాజమహేంద్రవరం సిటీ: క్షేత్ర స్థాయిలో భారత్ వికాస్ పరిషత్ సేవలు మరింతగా విస్తృతం చేసేందుకు నూతన కార్యవర్గం నిర్మాణాత్మకమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని భారత్ వికాస్ పరిషత్ రీజినల్ ఫైనాన్స్ సెక్రటరీ (సౌత్) రాజగోపాల పాయ్ పిలుపు నిచ్చారు. స్థానిక హోటల్ సూర్యలో రాష్ట్ర స్థాయి (విశాఖ ప్రాంత్) నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా నిర్వహించారు. ఏడాది కాలం రాష్ట్ర స్థాయిలో కొనసాగే కార్యవర్గం రాష్ట్ర (విశాఖ ప్రాంత్) అధ్యక్షుడిగా జి.బి.వి.సుబ్రహ్మణ్యం, కార్యదర్శిగా పీవీఎస్. నారాయణ, కోశాధికారిగా తాడోజు సాయి కృష్ణతో ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, భారత్ వికాష్ పరిషత్ శాఖల విస్తరణ, పని విస్తరణ, కార్యవిక్తార్, కార్యకర్త విక్తార్‌లపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ జనరల్ సెక్రటరీ సీహెచ్ మురళీధర్ సౌత్ రీజినల్ టీం జనరల్ సెక్రటరీ డి.పురుషోత్తమ శాస్త్రి, సౌత్ రీజినల్ టీం, మహిళా బాలవికాస్ డాక్టర్ బి.అనురాధ పాల్గొన్నారు. రాజమహేంద్రవరం, కొవ్వూరు, తుని, విశాఖ శాఖల నుంచి అధ్యక్షుడు కార్యదర్శులు, కోశాధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

పేదల వైద్యానికి సీఎంఆర్ఎఫ్ భరోసా



బాధితులకు చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు రూరల్: పేదల వైద్యానికి సీఎంఆర్ఎఫ్ భరోసాగా నిలుస్తోందని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మండలంలోని సమిశ్రగూడెం మండలపరిషత్ కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 59 మంది బాధితులకు రూ.29.72 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి దుర్గేష్ ఆదివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు రహదారి సమస్య పరిష్కారం



చీపురుగూడెంలో రహదారి పనులు పూర్తి చేసిన అధికారులు

నల్లజర్ల: మండలంలోని చీపురుగూడెంలో నల్లజర్ల–కొయ్యలగూడెం రహదారి పనులు గ్రామపెద్దల వివాదాల కారణంగా నిలిచిపోయింది. గ్రామంలో పుంతలో ముసలమ్మ అమ్మవారి ఆలయం ఎదురుగా బ్రిటిష్ కాలం నుంచి తూరలు పెట్టి ఎగువ ప్రాంతం నుంచి మురుగు నీరు కిందకు పోవడానికి మార్గం ఉండేది. కాలక్రమంలో అది పూడుకుపోయింది. ఇటీవల రహదారి అభివృద్ధి పనులు చేసేటప్పుడు అక్కడ తూరలు పెట్టకుండా ఒక వర్గం అడ్డుకుంటే మరో వర్గం కోర్టుకు వెళ్లింది. ఎట్టకేలకు ఆర్అండ్‌బీ డీఈ వెంకటరమణ చొరవతో అక్కడ తూరలు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలు సుగమం చేశారు. దీనితో ప్రయాణీకులతో పాటు వాహన దారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భూ కబ్జాలకు పాల్పడితే పీడీ యాక్ట్ అమలు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లాలో భూ కబ్జాలకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ అమలు చేస్తామని జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్ హెచ్చరించారు. మారిన కొత్త చట్టాలపై అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, జిల్లా పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశాన్ని పోలీసు కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భూ కబ్జాదారులను, రౌడీ షీటర్లను ఎట్టి పరిస్థితులను ఉపేక్షించవద్దని, వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్‌హెచ్‌వోలకు ఆదేశాలు జారీ చేశారు. డీజీపీ ఆదేశాల మేరకు నూతన చట్టాల విధి విధానాలకు లోబడి 60 రోజులు, 90 రోజులలోపు సకాలంలో చార్జ్‌షీట్లు దాఖలు చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని పోలీసు అధికారులకు సూచించారు. డ్రగ్స్, గంజాయి వంటి వాటిపై ఉక్కు పాదం మోపాలన్నారు. సాంకేతికతను ఉపయోగించి పెండింగ్ కేసుల్లో పురోగతిని సాధించాలన్నారు. కొత్త చట్టాల నిబంధనలు పకడ్బందీగా అమలు చేస్తూ, ప్రతి కేసు వివరాలను సీసీటీఎన్ఎస్‌లో డిజిటలైజేషన్ చేయాలన్నారు. గణేష్ ఉత్సవాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా జిల్లా పోలీసులందరూ పని చేయాలన్నారు. న్యూ క్రిమినల్ లా, ఐసీజేఎస్ వినియోగంపై అధికారులకు సూచనలు ఇచ్చారు. పాత కేసులలో అరెస్టు పెండింగ్ ఉన్న ముద్దాయిల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ ఎన్‌బీడబ్ల్యూలు త్వరితగతిన ఎగ్జిక్యూట్ చేయాలన్నారు. కార్డన్ సెర్చ్‌లు, నాకా బందిలు, వాహనాల తనిఖీలు తరచూ చేయాలన్నారు. వినాయక విగ్రహాలు ప్రతిష్టించే ముందు, వినాయక నిమజ్జనం ఊరేగింపు సమయంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు, భక్తులు విధిగా పాటించాల్సిన నియమ నిబంధనలు, తీసుకోవలసిన జాగ్రత్తలపై పోస్టర్‌ను ఎస్పీ ఆవిష్కరించారు. నేర సమీక్ష వేశంలో అడిషనల్ ఎస్పీలు ఎంబీఎస్ మురళీకృష్ణ, ఏవీ సుబ్బరాజు, ఎస్‌బీ డీఎస్పీ, సీఐ, జోనల్ డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

అధిక బరువుతో వెన్నెముక అరుగుదల

తాళ్లపూడి: మండలంలోని అన్నదేవరపేట పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం రాజమహేంద్రవరం వేద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెన్నుముక నిపుణులు డాక్టర్ పి.తేజో ఫణీంద్ర, స్త్రీల వైద్య నిపుణురాలు లక్ష్మీ మృదులతో కలిసి సంయుక్తంగా సుమారు 50 మంది రోగులకు మెడ నొప్పి, డిస్క్ సమస్యలు, ఆర్థరైటిస్, మహిళల సమస్యలు, ఎముకల సాంద్రత తెలుసుకునే బీఎండీ పరీకరంతో ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఎముకలు గట్టి పడడానికి పౌష్టికాహారంతో కూడిన కాల్షియం ఆహారం తీసుకోవాలని వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎలిపే సుధారాణి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, పిట్టా శ్రీనివాస్, కిషోర్, పిఆర్వో నవీన్, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడికి పరామర్శ



ఖాదర్‌వలీని పరామర్శిస్తున్న పార్టీ ముఖ్య నాయకులు

గోపాలపురం: రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి ఎస్‌కె ఖాదర్ వలీ సతీమణి అత్తర్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన విషయం విధితమే. ఈ మేరకు సమాచారం తెలుసుకున్న విశాఖ స్మార్ట్ సిటీ మాజీ చైర్మన్, గోపాలపురం నియోజకవర్గ మాజీ పరిశీలకులు గన్నమని వెంకటేశ్వరరావు ఆదివారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్ధన్, దేవరపల్లి, గోపాలపురం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు కుసులూరి సతీష్, వెలగా శ్రీరామమూర్తి, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

ఒకేసారి రెండు పోస్టులు



వైష్ణవీ హారిక

తాళ్లపూడి: ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో తాళ్లపూడికి చెందిన కొలచన వైష్ణవీ హారిక ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ (హిందీ విభాగం)లో 83.5 మార్కులతో జిల్లాలోనే మొదటి ర్యాంక్‌ను సాధించింది. ఎస్‌జీటీలో 87 మార్కులతో జిల్లాలో 44వ ర్యాంకు సాధించి అబ్బురపరిచింది. ఈ మేరకు ఆమె తండ్రి ప్రసాద్ తాళ్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాథ్స్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. కుమార్తె విజయం పట్ల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందనలు తెలియజేశారు.

సేవా పురస్కారం ప్రదానం



వేణుబాబుకు పురస్కారం అందజేస్తున్న సొసైటీ చైర్మన్ కిశోర్

నల్లజర్ల: దూబచర్లలోని ఎలైట్ కళాశాలలో తెలుగు ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్న గుంటి వేణుబాబు మదర్ థెరిస్సా జాతీయ సేవా పురస్కారాన్ని ఆదివారం అందుకున్నారు. గత ఆరేళ్లుగా అనాధలకు, వికలాంగులకు, వృద్ధులకు చేసిన సేవలకు గాను ఆయనకు మదర్‌థెరిస్సా ఎడ్యుకేషనల్ సొసైటీ ఫౌండర్ దిడ్ల కిశోర్ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కోనసీమ జిల్లా కలెక్టరు రవిరాల మహేష్ కుమార్, గుడివాడ సీఐ ఇంజిరపు రమణమ్మ తదితరులు పురస్కార గ్రహీతను అభినందించారు.

పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవు

- జిల్లా కలెక్టర్ ఆగ్రహం
- ఏఈకి షోకాజ్ నోటీసు ఇవ్వాలని ఆదేశం



సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ వ్యవహారంతో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్, నగర పాలక సంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్ పి.ప్రశాంతి ఆగ్రహం వ్యక్తం చేసారు. ఆదివారం నగరంలో లూథర్‌గిరిలోని ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని (సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ సెంటర్) ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్లాంట్ పనితీరుపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో వ్యర్థాల సేకరణ, శుద్ధి, రీసైక్లింగ్, కంపోస్టింగ్ పనుల అమలు పరిస్థితిని పరిశీలించారు. హెల్త్ అధికారుల నుంచి ప్రాసెస్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ, వ్యర్థాలను వనరులుగా మార్చడంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పి.ప్రశాంతి స్పష్టం చేశారు. రాజమహేంద్రవరాన్ని స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు అవసరమైన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఇంటి వద్ద చెత్త వేరు చేసి అందించడం ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యతగా భావించాలన్నారు. అయితే నగరంలో రోజుకు 160 టన్నుల చెత్త ఉత్పన్నం అవుతున్నా తడి, పొడి చెత్త వేరు చేసే ప్రక్రియ సక్రమంగా జరగకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ క్షేత్ర స్థాయి పర్యటన నేపథ్యంలో ఏఈ గైర్హాజరీపై తీవ్రంగా స్పందించి, షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే ఏ స్థాయి అధికారి అయినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్‌రావు, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, ఎస్ఈ ఎంసీహెచ్ కోటేశ్వరరావు, ఈఈ రీటా, డీఈ కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.